
# వర్షపు జల్లులలో...

కథా నిలయం
శ్రీకాకుళం



కిటికీలోంచి బయటికి చూస్తున్నాను. వర్షం పడేట్టుంది. అమ్మ నా పక్కగా వచ్చి నిలబడి 'పెద్ద వర్షమే వచ్చేట్టుంది' అంది. నేనేం మాట్లాడ లేదు. చిన్న సవ్వడితో వర్షం మొదలయింది. పెద్ద చినుకులు పడుతున్నట్టున్నాయి. శబ్దం స్పష్టంగా వినబడుతోంది.

అమ్మ గదిలోంచి బయటికి వెళ్ళింది. వర్షం వేగంగా పెద్దదవుతోంది. గాఢమైన కాఫీ పరిమళం. వెనగ్గా అమ్మ ట్రేలో నల్లటి మట్టి కప్పుల నిండుగా లేత బ్రౌన్ కలర్ నురగతో. కప్పు అందుకున్నా. అప్పటికి వర్షం పెద్దదయ్యింది. ధారగా కురుస్తోన్న సవ్వడి. కిటికీలోంచి గాలి వీచినప్పుడల్లా సన్నని జల్లు లోపలికి చిలకరిస్తోంది. జల్లు గాలితో ముఖాన్ని తాకినప్పుడల్లా జల్లుమంటోంది. వొకప్పుడు అలా తాకినప్పుడు హాయిగా అనిపించేది. గొప్ప అనుభూతి యీ ప్రపంచం నుంచి దూరంగా మరొక ప్రపంచంలోకి యే ఆలోచనలూ, బాధామయక్షణాలూ లేని స్వప్న ప్రపంచానికి వెళుతున్నట్టుగా వుండేది.

యిప్పుడంతా బాధామయ కాలం.

అమ్మ గదిలోని పెద్ద లైట్ ఆర్పివేసింది. చీకట్లోంచి వర్షాన్ని చూడటం అమ్మకి యిష్టం. చప్పున చీకటి అలుముకుంది. కొన్ని నిమిషాలు వర్షపు శబ్దం తప్పితే యేమీ వినిపించలేదు. ప్రపంచం సర్వమూ వర్షపు ధ్వనులతో నిండిపోయినట్టుగా ఆకాశంలోంచి యేవో రాలిపడుతూ సవ్వడులు చేస్తూ వాటితో కలగలిసి మధ్యమధ్యలో అస్పష్టంగా రోడ్డువారగా వర్షపునీరు పారుతోన్న ధ్వని... వొకప్పుడు అద్భుతంగా అనిపించిన ధ్వని. చీకటికి కళ్ళు అలవాటుపడ్డాక కొద్దిక్షణాల క్రితం కనిపించిన దృశ్యం మారిపోయింది. యెదురుగా మసకమసగ్గా వర్షం తెలుస్తోంది. సన్నటి మృదువైన లేతవేళ్ళతో ముఖాన్ని చరిచినట్టుగా వుంది. వర్షపుజల్లు ముఖాన విసురుగా తాకుతూ వుంది. వర్షం అస్పష్టంగా కనిపిస్తూ స్పష్టంగా వినిపిస్తూ వుంది.

“యేమైంది మహీ” అమ్మ మెత్తని స్వరం స్పష్టంగా అడిగింది. అమ్మ పెద్దగా ప్రశ్నలు వేయదు, అనివార్యమైతే తప్ప. అటువంటప్పుడు జవాబు చెప్పకుండా తప్పించుకోవటానికి వీలుకాదు. తప్పనిసరై కాదు. ఆ ఆత్మీయతని వదులుకోలేక.

అవును యేమయింది...

యింటర్మీడియెట్‌లో జాయిన్ అయిన కొత్తలో యేమయింది... అంతవరకు రోజూ స్కూల్‌కి స్కూల్ బస్సులో వెళ్ళటం, యింటికి రావటం. యూనిఫామ్ మార్చుకుని పాలు తాగేసరికి మ్యూజిక్ టీచర్ రావటం, సంగీతం క్లాస్ అయేసరికి ట్యూషన్ టీచర్ రావటం. ట్యూషన్ అవుతుండగా అమ్మ ఆఫీసు నుంచి యింటికి వచ్చేది. వంట చేస్తుండగా తమ్ముడు ట్యూషన్ నుంచి వచ్చేవాడు. ఆఫీసు,

స్కూలు కబుర్లు, పుస్తకాలలో కథలు, పాటలు, మాట్లాడుకుంటూ భోజనాలు చేయటం. నాన్నగారు తొమ్మిది గంటల కంటే ముందు యింటికి రావటం తనెప్పుడూ చూడలేదు. యిలా పదో తరగతి వరకు సాగింది. యింటర్మీడియెట్‌లో జాయినయ్యాక బస్టాండ్‌కి వెళ్ళటం, బస్సెక్కటం, ట్యూషన్‌కి ట్యుటోరియల్ కాలేజ్‌కి వెళ్ళటం. వొక ప్రొటెక్టడ్ జీవితం నుంచి బయటికొచ్చిన ఫీలింగ్. నా ముందున్న సమయమంతా డిజైన్ చేసుకునే అవకాశం యేదో దొరికిన భావం. గమ్మత్తుగా అనిపించేది.

అంతవరకూ యూనిఫామ్‌లో వెళ్ళటంతో రోజూ యే బట్టలు వేసుకోవాలనే ఛాయిస్ వుండేది కాదు. రోజు వో డ్రెస్ వేసుకున్నా పదిరోజులు తిరిగేసరికి వేసుకొంటున్న బట్టలే వేసుకొంటున్నట్టుండేది.

"అంతా రోజుకో డ్రెస్ వేసుకొస్తారు తెలుసా. నేనే యెప్పుడూ వేసుకొనేవే వేసు కొస్తున్నట్టుంటా" అన్నానారోజు.

అమ్మ కాసేపు యేమీ మాట్లాడలేదు.

"యెన్ని బట్టలుంటే బాగుంటుంది నీకు" అని అడిగింది.

"యెన్నంటే... చాలా..."

"ఆ చాలా అంటే యేమిటో నీకు తెలియదు. వూరికే చింతించకు. రోజుకో కొత్త డ్రెస్ సంవత్సరమంతా వేసుకొనేంత సంపాదన మనకి లేదు. వున్నా అన్ని బట్టలు కొనను కూడా. మరీ తడుముకునేంత తక్కువేం లేవు కదా. అడిగావు కదా వో రెండు జతలు కొనుక్కుందువు" అంది.

కాలేజీకి వచ్చేవాళ్ళలో నాలా బస్సులో వచ్చేవాళ్ళు చాలా తక్కువమంది. టూ వీలర్స్ మీదో, కార్లలోనో వచ్చేవాళ్ళు యెక్కువ. రోజూ బస్సెక్కి అంత దూరం వెళ్ళటం, బస్సు దిగి ఐదు నిమిషాలు నడవాలి కాలేజీకి. బండుంటే...

"వెహికిల్ కొనవా" అడిగానో రోజు.

"యెందుకు?" అమ్మ అడిగింది.

"ఆ... రోజూ ఆ బస్సులో యెవరు వెళతారు..."

"కొందాం" అన్నారు నాన్నగారు.

"యిప్పుడంత డబ్బెక్కడుంది" అడిగింది అమ్మ.

"పిలిచి లోన్స్ యిస్తోంటే"

"నెలనెలా కట్టొద్దూ"

"కడదాం"

"యిప్పుడంత అవసరమా"

"నాకు కంప్యూటర్ కావాలి" అడిగాడు ప్రమోద్.

"యెనిమిదో క్లాసుకే నీకెందుకురా" అంది అమ్మ.

"ఆ... మా ఫ్రెండ్స్ అందరికీ వున్నాయి. యెనిమిదంటున్నావ్... నర్సరీ వాళ్ళకి కూడా కంప్యూటర్స్ వుంటున్నాయి. నాక్కావాలి" పేచీ పెట్టాడు ప్రమోద్.

"నీక్కావాలంటే తర్వాత అడుగు. నేనేదైనా అడిగినప్పుడే అడగాలా" యీ కంప్యూటర్ పేచీతో వెహికిల్ కొనటం వాయిదా వేస్తారేమోననే భయంతో చప్పున అన్నాను.

"నువ్వే తర్వాత అడుగు. ముందే చెబుతున్నా, నా కంప్యూటర్ ముట్టుకో కూడదు" అన్నాడు ప్రమోద్.

"అఁ యెందుకు ముట్టుకోకూడదు. అయితే నాక్కూడా వేరేది కొనండి. ఆ సైబర్‌కేఫ్‌కి వెళ్ళి మెయిల్స్ చూసుకోవాల్సి వస్తోంది" అన్నాను.

"వో నీకు నెట్ కూడా కావాలా. అప్పుడు చాలా అవుతుంది" అన్నాడు ప్రమోద్.

"కంప్యూటర్ అక్కకీ యివ్వాలి. నీవొక్కడికే అంటే యెలా" అన్నాడు నాన్న.

"యిప్పుడు కంప్యూటర్ యెందుకండీ... ఆ టి.వి., వీడియో గేమ్స్‌తోనే వీడికి లోకం. చదువు మీదే దృష్టి వుండదు. యిప్పుడా కంప్యూటర్ తీసుకొస్తే యింక పుస్తకం ముట్టుకోనే ముట్టుకోడు" అమ్మ విసుక్కుంది.

వారంరోజుల్లో నాకో టూ వీలర్, తమ్ముడికో కంప్యూటర్ యింటికి వచ్చాయి.

నాన్నగారు నన్ను, వెహికిల్‌ని ఆంజనేయస్వామి గుడికి తీసుకెళ్ళి వాహనపూజ చేయించారు. యింటికొచ్చాక అమ్మని బండి వెనుక కూర్చోబెట్టుకుని కాలనీలో తిప్పి తీసుకొచ్చా. తరువాత రోజు అమ్మ హెల్మెట్ కొనిచ్చింది.

"వద్దమ్మా, నవ్వుతారు" అన్నా.

"నో... పెట్టుకోవాల్సిందే" స్పష్టంగా చెప్పింది.

తమ్ముడికీ నాకూ కంప్యూటర్ దగ్గర పేచీ వస్తూనే వుంది. రోజూ వొక్కసారన్నా నా బండిపై తిరిగొస్తానని తాళాల కోసం గొడవ చేస్తూనే వుంటాడు. యిస్తే వో గంట మాయమైపోయేవాడు. బండి కొనుక్కున్నందుకు ఫ్రెండ్స్ పార్టీ అడిగారు. మా కాలేజ్ దగ్గరున్న బేకరీలో అందరికీ పేస్ట్రీస్, పఫ్స్, కేక్ యిప్పిస్తానని చెప్పాను. అమ్మకి చెబితే డబ్బులు యిచ్చింది. ఫస్టియర్ చూస్తుండగానే అయిపోయింది.

సీడీస్, వీసీడీస్, డీవీడీస్- అంతం లేకుండా కబుర్లు సాగుతూనే వుంటాయి. చాలామంది చేతుల్లో సెల్‌ఫోన్స్, పార్టీలు, షాపింగ్, బ్యూటీపార్లర్స్. యింత సమయాన్ని యిలా గడిపినా అందరికీ మార్కులు బాగొస్తున్నాయి. వొక్కొక్కరి దగ్గర భవిష్యత్‌కి కావల్సినన్ని ప్లాన్స్ వున్నాయి.

"మమ్మీ వీసీడి ప్లేయర్ కావాలి" ప్రమోద్ గొడవ మొదలుపెట్టాడు.

"మొన్నే కదా కంప్యూటర్ కొంది" అంది అమ్మ.

"ఆ... బోర్ పాతదైపోయింది. నాక్కావాలి"

"యిప్పుడెందుకురా"

"యెందుకేంటీ సినిమాలు చూడొద్దా..."

"యీ రెండేళ్ళూ కష్టపడి చదవరా. మార్కులు రాకపోతే మంచి కాలేజీలో సీటు రాదు" అమ్మ అంటుంది.

"వూ... కావాలి"

"వీసీడి ప్లేయర్ వుంటే బాగుంటుంది. మా క్లాస్‌లో అందరిళ్ళల్లోనూ వుంది తెలుసా. వాళ్ళంతా వీసీడీస్ గురించి మాట్లాడుకుంటుంటే నే వింటూ కూర్చోవాలి. చూస్తే అప్పుడు నేనూ మాట్లాడొచ్చు" అన్నాను.

అమ్మ నావైపు వో క్షణం చూసి "నువ్వూ, నువ్వు చదువుతున్న కథల పుస్తకాలు, మ్యూజిక్ గురించి మాట్లాడు" అంది.

"అవి యెవ్వరూ మాట్లాడరు. బోర్ అంటారు" అన్నాను.

"అవి మాట్లాడకే అక్కా, నువ్వో బోర్ బర్గర్ అనుకుంటారు" అన్నాడు ప్రమోద్.

"కొనుక్కుందాం" అన్నాను.

"యిప్పుడన్ని డబ్బులు యెక్కడున్నాయి. మనకి మ్యూజిక్ సిస్టమ్ వుంది కదా. దాన్నేం చేయాలి" అంది అమ్మ.

"యెవరో వొకరికి అమ్మేస్తే" అన్నాను.

"యిన్‌స్టాల్‌మెంట్‌లో యిస్తారు మమ్మీ" అన్నాడు ప్రమోద్.

"యిప్పటికే వెహికిల్‌కి, కంప్యూటర్‌కీ కట్టలేకపోతోంటే" అంది అమ్మ.

"నాన్నగారిని అడుగుతానుండు" అని తమ్ముడు అంటుండగా నాన్నగారు వచ్చారు.

ఆయన చేతిలో కొత్త సెల్!

"వో... సెల్" అంటూ నేనూ, తమ్ముడూ సరదాపడుతోంటే అమ్మ విస్తుపోతూ "సెల్ యెందుకు ప్రకాష్" అంది.

"ఆ యివాళా రేపు అందరి దగ్గరా వుంటున్నాయి. యెవరు చూసినా యేంటీ సెల్ లేదా అంటున్నారు. తీసుకున్నా" అన్నారు నాన్నగారు.

"మనింట్లో ఫోన్ వుంది. మనిద్దరికి ఆఫీసుల్లో ఫోన్స్ ఉన్నాయి. యీ చివర్నుంచి ఆ చివరికి పనిపై తిరిగే వుద్యోగాలు కావు. యేం అవసరం... అవసరం లేని వస్తువులు యెందుకు" అంది అమ్మ.

"యీ రోజుల్లో సెల్ నెస్ససరీ" అన్నారు నాన్నగారు.

అమ్మ నాన్నగారివైపు వొక చూపు చూసి "యింకా మన నెస్ససరీస్‌లో యేమేమి చేరబోతున్నాయో... జీతమంతా యిలా యిన్‌స్టాల్‌మెంట్స్‌కే పోతుంటే యెలా" అంది.

"డాడీ... వీసీడీ" ప్రమోద్ గొడవ మొదలుపెట్టాడు.

"కొందాం... కొందాం"

"అరే ప్రకాష్ అసలు యేం ఆలోచించకుండా కొనేద్దాం అంటావేంటి? నువ్వు వూ అంటే చాలు యింక రేపట్నుంచి కొనిచ్చేవరకు వాడి మనస్సు అస్సలు పుస్తకం మీద నిలవదు" అంది అమ్మ.

"పోనీలేబ్బా సరదా పడుతున్నాడు" అన్నాడు నాన్న.

"యిలా సరదా సరదా అనుకుంటుంటే రేప్పొద్దున అవి తీర్చలేని రోజొకటి వస్తుంది. అప్పుడొదులుతుంది మన సరదా" అంది అమ్మ.

వేగంగా గాలితో జల్లు ముఖంపైకొచ్చి కొడుతోంటే ఆలోచనల నుంచి బయటికి వచ్చాను.

అమ్మ అడిగిందానికి నేనింకా జవాబు చెప్పనేలేదు. యిలాంటి వో వర్షకాలపు మధ్యాహ్నం వెహికిల్ డ్రైవ్ చేయటం అసాధ్యమనిపించి కాలేజ్ ఆవరణ దగ్గరున్న బస్టాప్‌లో నిల్చున్నా.

అప్పుడొచ్చాడు ప్రదీప్, మెటాలిక్ సిల్వర్ రంగున్న కారులో.

"హాయ్... కమ్... డ్రాప్ చేస్తా" అన్నాడు.

"వెహికిల్ వుంది" అన్నాను.

"వో.కె పార్క్ చేశావ్‌గా. వర్షం తగ్గాక యిక్కడ వదిలేస్తా. యిక్కడెందుకు తడవటం" అన్నాడు.

ప్రదీప్‌ని నాలుగైదుసార్లు చూశా. మా క్లాస్‌మేట్ దీపాలీ కజిన్. తన కోసం వస్తుంటాడు. చిన్ని పరిచయం. కారు నీళ్ళు నిండిన రోడ్డు మీద నుంచి సాగుతోంది. టేప్ రికార్డ్‌లోంచి రిక్కీ మార్టిన్ గొంతు.

"మహీ... స్వీట్ నేమ్" అన్నాడు.

"వో... థాంక్యూ" చప్పున చెప్పాను.

"వర్షంలో అలా వుంటే తడిసిపోవా"

"వూహుఁ... వర్షంలో తడిస్తే బాగుంటుంది."

"వో... వర్షం యిష్టం. సో రెయిన్‌డాన్స్ యిష్టం."

"రెయిన్ డాన్స్‌కి నేనెప్పుడూ వెళ్లలేదు."

"వెళ్ళలేదా..."

"వూహుఁ"

"డిస్కో?"

"వుహూఁ"

"పబ్"

"వూహూఁ"

"యెప్పుడూ వెళ్లలేదా... వొక్కసారి కూడా" ఆశ్చర్యంగా అడిగాడు ప్రదీప్.

"లేదు"

"వో బాయ్‌ఫ్రెండ్స్"

"లేర్లేరు" కంగారుగా చెప్పాను.

"యింత అందమైన మహీకి యిప్పటివరకూ యెవ్వరూ ప్రపోజ్ చేయలేదా?" ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసి అడిగాడు.

"లేదు"

"సాయంకాలం రెయిన్‌డాన్స్‌కి వస్తావా" అడిగాడు.

"రాను... రాను..."

"యేం డాన్స్ రాదా"

"నాకు అలాంటిది తెలియదు."

"వో... కమాన్ చాలా బాగుంటుంది. చాలా యెంజాయ్ చేస్తావ్" అన్నాడు ప్రదీప్.

కారు వో పోర్టికోలో ఆగింది.

"కమాన్" అంటూ తను కారు దిగి కీస్ తెల్లని యూనిఫామ్‌లో వున్న వ్యక్తికి యిచ్చాడు.

అదేంటో తెలియదు. యేంటని అడిగితే యేమనుకుంటాడో, అతని వెనుక లోపలికి అడుగుపెట్టాను.

వో యింటిని పబ్‌గా మార్చారు.

ఆ లోపల లో వెలుగు సువాసన. మెత్తని పాలరాయి నేల. హుషారైన సంగీతం చిన్నిస్థాయిలో. అక్కడక్కడా అమ్మాయిలు అబ్బాయిలు చేరి విస్కీ తాగుతూ సిగరెట్స్ కాలుస్తూ.

పూర్తి వెస్టర్న్ ఫిట్టింగ్స్‌లో.

నా బట్టలవైపు చూసుకున్నాను. షల్వార్ కమీజ్ కాటన్‌వి. కనీసం షార్ట్ కుర్తా ఐనా కాదు. పొడవైన జడ. వీళ్ళంతా నేనో వోల్డ్ స్టైయిల్ బర్గర్ అనుకుంటారు. అప్పుడప్పుడు జీన్స్ వేసుకుంటా. కనీసం యీరోజు ఆ జీన్స్, ఆ లూజ్ టీ షర్ట్ అయినా వేసుకోలేదు. స్కిట్ టైట్ టాప్స్ లేనేలేవ్. సిగరెట్ వెలిగిస్తూ "యేం తీసుకుంటావ్" అడిగాడు ప్రదీప్.

కాఫీ అంటే బాగాదేమో... కోక్... గుడ్ నన్ను నేనే అభినందించుకొంటూ "కోక్" అన్నాను.

"కోక్ విత్..."

విత్... స్నేక్స్ చెప్పాలా అనుకొంటుంటే అతనే అన్నాడు "యీ వర్షంలో బీర్ తాగితే భలేగుంటుంది"

"విత్ అంటే యిలాంటిది చెప్పాలా... బీర్... బాప్‌రే... కాదంటే బాగుండదేమో... యేం అనుకుంటాండో... యీ అలవాటు లేని పనిచేస్తే యేం అభాసుపాలవు తానో... అంతా యింతగా నవ్వుతూ తుళ్లుతూ చాలా మామూలుగా తాగుతున్నారు కదా. యిందులో వున్న కిక్ యేమిటో. వొక్కసారి రుచి చూస్తే. తాగ్గానే వాంతొస్తే బాగుండదేమో. తాగాక బయటకి నడవలేకపోతే అంతా చెత్తచెత్తగా తయారవు తుందేమో పరువుపోతుందేమో... ముందే యీ బట్టలు, జడ పురాతనంగా వున్నాయి... యేం చెపుదాం... తాగాక బస్టాప్‌లో వదులుతాడు. ఆ బండి మీద వెళుతూ కింద పడితే... యేలాగోలా యింటి వరకూ వెళ్ళినా యింట్లో తెలిసిపోతే... ఆ అమ్మ రాకముందే వెళుతుంది కదా శుభ్రంగా బ్రష్ చేసుకొని యేలక్కాయ నోట్లో వేసేసుకుంటే సరి. ఛ... యెందుకింత గొడవ... అంతా హాయిగా కాఫీ తాగినదానికంటే సునాయాసంగా తాగుతోంటే. పబ్స్ నిండా యీ అమ్మాయిలు, అబ్బాయిలని ఫోటోస్ వేసి రాస్తుంటే వొక్కసారి టేస్ట్ చూస్తే యేమవుతుంది. వొక్కసారే కదా... అనుకోకుండా వచ్చిన అవకాశం.

"బీర్ ఆర్డర్ చేస్తున్నా" అన్నాడు.

"వూ" కళ్ళతో చెప్పాను.

బీర్ కొన్ని స్నేక్స్ వచ్చాయి.

అతని సెల్‌కి కాల్స్ వస్తూనే వున్నాయి.

"సెల్ వాడవా" అడిగాడు.

'వాడవా... అదేదో వాడే తాహతుండి వాడటం యిష్టంలేక వాడనట్టు'... నవ్వొచ్చింది.

"ఛీర్స్" అన్నాడు గ్లాసు కొసలు తాకిస్తూ.

సిప్ చేస్తున్న అతనివైపే కళ్లార్పకుండా చూసా. అతని ముఖంలో యెక్కడా ఆ రుచిని పట్టుకోగలిగే భావాలేం కనిపించలేదు. అతనికి అలవాటు కదా.

మెల్లగా గ్లాసు పెదవుల దగ్గరికి తీసుకొచ్చాను. వొక్క సిప్... జివ్వుమన్న నాలిక... వగరుగా... నా వల్లకాదు... ఆ చల్లదనం గొంతులోకి జారుతోంటే యీ రుచి తెలియకుండా చప్పున జీడిపప్పు నోట్లోకి సుతారంగా వేసుకున్నా.

వదిలేస్తో బాగోదు. యెలాగోలా పూర్తి చేసేస్తే యింకెప్పుడూ తాగకూడదు.

రెండో సిప్... యీసారి వెంటనే జీడిపప్పు నోట్లో వేసుకోవాలనిపించలేదు. మెల్లమెల్లగా ఆ రుచి అలవాటైపోయింది.

ప్రదీప్ తను వెళ్ళే డిస్కోలు, పార్టీలు, సెల్‌ఫోన్స్, సినిమాలు మాట్లాడుతున్నాడు.

అతను చదువు విషయం యేం మాట్లాడటంలేదు. అతనితో యేం మాట్లాడాలో తెలియక మౌనంగా వింటున్నా.

సెడన్‌గా నా దగ్గర యెక్కువ డబ్బులు లేవని గుర్తొచ్చింది. యెలా బిల్ పే చేయటం... ప్చ్... అతని దగ్గర వున్నాయో లేవో... అతనికి చెప్పేస్తే... బిల్ రానీ చెప్పొచ్చు.

సాయంకాలం ఆరవుతోంటే తాగటం తినటం పూర్తి చేసి బిల్ తెమ్మన్నాడు.

'నే పే చేయటంలేదు. అన్ని డబ్బులు నా దగ్గర లేవ్' అని రిహార్సెల్స్ వేసాను కానీ చెప్పలేకపోయా.

అతను క్రెడిట్ కార్డుతో పే చేసాడు.

"యేం చేస్తుంటావ్" అడిగా.

"అంటే"

"చదువు... జాబ్... బిజినెస్"

"చెప్పకో"

"చెప్పలేను"

"స్టూడెంట్"

"యేం చదువుతున్నావ్"

"యింజనీరింగ్ థర్డ్ యియర్"

"వో"

అతను కారుని డ్రైవ్ చేస్తూ "రెయిన్ డాన్స్‌కి వెళదామా" అడిగాడు.

"యిప్పుడా... నో... యింటికి వెళ్ళిపోవాలి."

"రేపు"

"సాయంకాలం కష్టం యింట్లో పంపించరు"

"యెందుకు. అందులో రాంగ్ యేముంది" ఆశ్చర్యంగా అడిగాడు.

"మీరంతా యింట్లో చెప్పే వెళతారా"

"నే బాయ్‌ని కదా... యేం అడగరు" అన్నాడు.

"దీపాలి"

"తెలియదు. చెపుతుందో లేదో. అయినా అదేమంత పెద్ద విషయం. మేనేజ్ చెయి" అన్నాడు.

"థ్యాంక్స్" కారు దిగుతూ అన్నాను.

అతను చిరునవ్వుతో కుడిచేయి చాచాడు. కుడిచేయి చాపాను. యింటికెళ్ళిన కాసేపటికి నిద్ర వస్తుంటే పడుకున్నా. తరువాత రోజు యింట్లో ఫ్రెండ్ పుట్టినరోజు పార్టీ అని చెప్పాను. అమ్మ వెళ్ళమంది. జాగ్రత్తగా రమ్మంది. కాలేజ్‌కి వెళుతుంటే చిన్ని గిఫ్ట్ ప్యాకెట్ యిచ్చింది.

"యేంటిది"

"పుట్టినరోజు అన్నావ్ కదా. చిన్ని గిఫ్ట్. పుస్తకం" అంది.

"చదవరేమో" లోపలెక్కడో చివుక్కుమంటుంది. అమ్మతో యిలా లేనిపోని ప్రోగ్రామ్ చెప్పినందుకు. మానేస్తే ఆ... వొక్కసారే కదా యెలా వుంటుందో చూస్తే సరి. యింకెప్పుడూ యిలా చెప్పను. సారీ... మనసులోనే అనుకున్నా.

'మనం యివ్వాలనుకున్నది యివ్వాలి. మంచి పుస్తకం. పొరపాటున చదివి నచ్చితే మంచిదే కదా..." అంది అమ్మ. యెక్కువసేపు అమ్మ దగ్గర నిలబడలేక ఆ గిఫ్ట్ అందుకుని త్వరత్వరగా కాలేజ్‌కి వెళ్ళిపోయాను.

యీ లూజ్ షర్ట్‌లో వెళితే బాగుండదేమో ఆలోచించా. కానీ యిప్పుడు స్కిన్ టైట్ టాప్‌నెలా సంపాదించటం. సరే యిలాగే వెళతా.

సాయంకాలం యేడువుతోంటే డాన్స్ దగ్గరికి తీసుకెళ్ళాడు ప్రదీప్. ఆర్టిఫిషియల్ వానలో అమ్మాయిలు, అబ్బాయిలు వుషారుగా డాన్స్ చేస్తున్నారు. బోల్డంత బెరుగ్గా తటపటాయింపుగా అనిపించింది. అలా చేయలేననిపించింది. ప్రదీప్ యెంకరేజ్ చేసాడు. ప్రదీప్ రెండు చేతులు నా నడుం మీద వేసి నా ప్రమేయం లేకుండానే డాన్స్ చేస్తూ నాతోనూ చేయించేస్తున్నాడనిపించింది.

ఆ రాత్రి పదవుతోంటే తడిసిపోయిన నేను యింటికి యెలా వెళ్ళటమాని కంగారు పడుతోంటే "ఆఁ యేదో వొకటి చెప్పు" అన్నాడు ప్రదీప్.

అంత ఆలస్యంగా తడిసిపోయి యింటికొచ్చిన నన్ను చూసి అమ్మ కంగారు పడుతూ "తడిసిపోయావేంటి" అంది.

"వచ్చే ముందు బాత్‌రూంలోకి వెళ్ళా. తెలియక షవర్ విప్పా. వెంటనే క్లోజ్ చేయడం రాలే. బట్టలు మార్చుకొని వెళ్ళమంది. కానీ ఆలశ్యం అయిపోతోందని వచ్చేశా" అన్నాను.

"మనింట్లో షవరుంటే యిలా అవ్వదు కదా" అన్నాడు తమ్ముడు.

"నీ దగ్గర ఆ యింటి నెంబర్ తీసుకోలేదు వుదయం. చాలా కంగారుపడ్డా" అంది అమ్మ.

ఆ రెయిన్ డాన్స్‌కి వెళ్ళటం యెప్పుడు చూడని వో కొత్త వాతావరణం చూసినట్టు

అనిపించింది. కానీ యింట్లో అమ్మ కంగారుచూసి 'యెందుకొచ్చినవివన్నీ' అనిపించింది. ఆరోజు అలా బీర్ రుచి చూడటం యీ రెయిన్ డాన్స్‌కి వెళ్ళటంతోనే యింట్లో చెప్పే పొంతనలేని, కలిపించే మాటలు ఆగిపోలేదు.

వోసారి డిస్కో... మరోసారి ఫామ్‌హౌస్ పార్టీ, మరోసారి వీకెండ్ పార్టీ యేదో వొక పబ్‌కి యిలా సాగుతూనే వుంది. ప్రదీప్ సిటిలో వున్న పబ్స్‌కి, పార్కులకి స్టార్ హోటల్స్, రెస్టారెంట్స్‌కి, డాబాలకి, డాన్స్ పార్లర్స్‌కి తిప్పుతూనే వున్నాడు. అనేక రంగాలలోని వాళ్ళ పిల్లలూ, రకరకాల భాషలవాళ్ళూ అంతా పరిచయం అవుతున్నారు. బాగా పరపతున్న వాళ్ళు, డబ్బున్నవాళ్ళు, ప్రముఖుల పిల్లలతో సమాన స్థాయిలో హోటల్స్‌లో బఫేకి వెళ్ళటం డాన్స్ చేయటం కారులో తిరగటం అంతా భలే గమ్మత్తుగా అనిపించేది. నా స్థాయి పెరిగిన యిగో సాటిస్‌ఫేక్షన్.

యింట్లో నిజం చెపితే పంపించరు అందుకే అవీ యివీ చెపుతున్నానని నాకు నేను నచ్చజెప్పుకునేదాన్ని. కానీ లోపలెక్కడో చిన్న బెంగ వుండేది, నాపై బోల్డంత నమ్మకం పెట్టుకున్న అమ్మకి యివన్నీ తెలిస్తే యేం అనుకుంటుందని. చదువుపై, పుస్తకాలపై తగ్గుతున్న శ్రద్ధ. ప్రదీప్‌తో మాట్లాడటానికి వీలుగా సినిమా పత్రికల్లోని గాసిప్ చదవటం, వస్తున్న సినిమాలు వాళ్ళ జీవితాలు, పాటల ఆల్బమ్స్, వీలైనంతగా బరువు పెరక్కుండా చూసుకోవటం... యింట్లోవాళ్ళకి అనుమానం రాకుండా యెలాగో చూసుకోవటం, అవకాశం దొరికితే గంటలుగంటలు అతనితో ఫోన్‌లో కబుర్లు చెప్పటం... మానసికంగా అస్సలు ఖాళీ లేకపోవటం. కారు, సెల్, చాలా అందమైన బట్టలు లేవనే చింత.

యెగ్జామ్స్ అయిపోయాయి. అరాకొరా మార్కులతో పాస్ అయ్యాను.

అమ్మ షాక్ అయింది.

"బాగా రాసాననన్నావ్" మెల్లగా అంది.

మౌనంగా వుండిపోయా.

అమ్మ సతాయించలేదు. కానీ ఆలోచనలో పడింది. డిగ్రీలో జాయిన్ అయిన నెలకి వోరోజు మధ్యాహ్నం ప్రదీప్ వో చిన్ని తోటున్న ప్రదేశానికి తీసుకువెళ్ళాడు.

లోపల వో యిల్లుంది. అతని వెంట లోపలికి వెళ్ళాను. గదిలోకి వెళ్ళాడు. వో డబుల్ కాట్, టి.వి., చిన్న ఫ్రిజ్... ఏ.సి.

"యేంటిది"

"గెస్టహౌస్"

అతనీ ఆరునెలల కాలంలో యెప్పుడూ యిలా వొంటరి ప్రదేశాలకి తీసుకు రాలేదు.

భయం వేసింది.

అప్పటికే తాగున్న అతను మరో బాటిల్ వోపెన్ చేసాడు. మంచంపై వెనక్కి జరిగి కూర్చుంటూ చెయ్యి చాపాడు.

భయం పెరిగింది. చప్పున తలుపు తీసుకొని గదిలోంచి బయటికి వచ్చేసాను. రోడ్డు మీదకొచ్చి ఆటో యెక్కేసాను. అంత మెరుపువేగం నాకుందని అప్పుడే తెలిసింది.

ఆ రాత్రి వుండలేక ప్రదీప్‌కి కాల్ చేసాను.

"పారిపోయావ్" కూల్‌గా అన్నాడు.

"భయం వేసింది."

"మొదట్లో అలానే అన్నీ భయం వేస్తాయ్. రేపు వెళదామా"

"అలాంటివి యిష్టంలేదు ప్రదీప్. పెళ్ళి అయ్యాక"

"పెళ్ళా... మహీ నువ్వు లేనిపోనివేవో వూహించుకుంటున్నావేమో... క్లియర్ చేస్తున్నా. యిదంతా జస్ట్ ఫన్. అంతే. పెళ్ళి... నో... అలాంటిదేం లేదు" అన్నాడు.

"మరి మరి యిన్నాళ్ళు... నువ్వు నేను యీ స్నేహం! గర్ల్‌ఫ్రెండ్ అన్నావ్. వాలెంటైన్స్ డే రోజు గిఫ్ట్ యిచ్చావ్" గొంతు తడి ఆరిపోతోంటే మాటలు ఆగిపోయాయి.

"వో మహీ... యిదంతా జస్ట్ ఫర్ ఫన్... పెళ్ళి అదంతా మా యింట్లోవాళ్ళ యిష్టం. పేరెంట్స్‌ని కష్టపెట్టడం యెందుకు చెప్పు. అరే యింత బాక్‌వర్డ్ ఆలోచన లున్నాయని తెలీదు. అప్పుడే చెప్పేవాడిని. నువ్వూ యెప్పుడూ అడగనూ లేదు. అయినా చూడు యిలా రోజూ తిరిగేవాళ్ళంతా పెళ్ళిళ్ళు చేసుకుంటారనుకుంటు న్నావా... యెక్కడివక్కడే మర్చిపోవాలి. ఫన్ దారి ఫన్‌ది. చదువు దారి చదువుది. ఆ తర్వాత కెరీర్... పెళ్ళి పిల్లలు... యింత బాక్‌వర్డ్‌గా వుండకు. మోడ్రన్‌గా వుండు" అతను చెపుతూనే ఉన్నాడు.

ఫోన్ పెట్టేశాను.

అసహ్యం వేసింది నాపై నాకే.

ఆ అసహ్యం రోజురోజుకీ యెక్కువవుతోంది. కాలేజీకి వెళ్ళటం, యింటికి వచ్చి అలా మంచంపై వాలిపోవడం, ముభావంగా మారిపోయా. యింటర్మీడియెట్‌లో మంచి మార్కులు వచ్చి వుంటే మంచి కాలేజీలో అడ్మిషన్ వచ్చి వుండేది. నా జీవితమంతా ఆ మార్కులషీట్ వెక్కిరిస్తోనే వుంటుంది.

యిలా యెందుకు జరిగింది.

నాపై నాకు కలిగిన అసహ్యం రోజురోజుకీ పెరిగిపోతూనే వుంది. నాలో తేడా అమ్మ గమనించింది.

"నీకెలా తెలుసు యేదో జరిగిందని" అడిగా అమ్మని.

"నీలోని ఆర్టిఫిషియల్ ఆనందాల్ని నే పట్టుకోలేకపోయా. కానీ నీ నిజమైన దిగుల్ని గుర్తుపట్టా" అంది అమ్మ.

బయట వర్షపు చప్పుడులా అమ్మ మాటలు మృదువైన పాటలా వినిపిస్తున్నాయి.

చెప్పేసాను. పూర్తిగా చెప్పేసాను.

"లోపలెక్కడో చివుక్కుమంటున్న క్యూరియాసిటి డామినేట్ చేసింది. అసహ్యంగా వుంది" అన్నాను.

"వర్షంలో కాసేపు తడుద్దాం వస్తావా" అడిగింది అమ్మ.

చిన్నగా నవ్వాను. యింతకు ముందైతే యిప్పటిదాకా ఆగేదాన్నా. ముందుగా వర్షంలో పరిగెత్తేదాన్ని. "యిప్పుడా మూడ్ లేదు" అన్నాను.

నాకు వూహ తెల్సినప్పట్నుంచీ వర్షం వచ్చిందంటే మైమరచి ఆ వర్షాన్ని అమ్మ సెలబ్రేట్ చేయటం బాగా గుర్తు. వొక అద్భుతంతో ఆడుకుంటున్నట్టు అమ్మ నాతో తమ్ముడితో వర్షంలో ఆడుకునేది. తడిసితడిసి యింట్లోకొచ్చి పొడి బట్టల్లోకి మారి వేడివేడిగా యేమైనా చేసిపెట్టేది.

"రా" అంది.

"రాలేను" అన్నాను.

అమ్మ నవ్విన నవ్వు ఆ చీకటిలో మెత్తగా సోకింది.

"యిదంతా అసహ్యం వల్లనే" అడిగింది.

"నాకేం బాలేదు"

"మహీ మన చుట్టూ చాలా వచ్చి పడుతుంటాయి. వుక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. యెంచుకొనే ఛాయిస్ మనకుండాలి. అయితే అదేమంత తేలికైన విషయం కాదు. బాగా అనుభవజ్ఞులే కొట్టుకుపోతుంటారు. వస్తువులు డబ్బు పవర్ పేరు యేమైనా కావొచ్చు. ది బెస్ట్ అనే వాటికి పరిచయం చేస్తూనే వున్నాను. కానీ నీ చుట్టూ వున్నది నా వొక్క ప్రపంచమే కాదు. అనేకానేక ప్రపంచాలున్నాయి. వాటి ప్రభావం నీపై వుంటుంది. యీ వొక్క అనుభవంతోనే జీవితం అయిపోదు. ఆగిపోదు. నీకెలా చెప్పాలో తెలియదు. యెక్కడ నుంచి చెప్పాలో తెలియదు. చిన్నపిల్లవి. వొక్కటి మాత్రం చెప్పగలను. నీ బాధ బాధగా నాకు తెలుస్తుంది. నీ బాధని తీసుకొని పంచుకొనే మనుష్యులున్నప్పుడు ప్రపంచం చాలా వుంటుంది. యీ బాధ చివర యే కాంతీ లేదని మాత్రం అనుకోకు" అమ్మ మాటలు వానజల్లు ముఖంపై చిలకరిస్తోన్నంత చల్లగా మృదువుగా నాలోకి యింకుతున్నాయి.

"కొన్నిసార్లు గాయపడటం అనివార్యం. అవసరం. వొక కొత్త జీవితం అందులోంచే చిగురిస్తుంది. ఆ నమ్మకం నాకు వుంది" అంటూ అమ్మ తలుపులు తెరిచింది.

వర్షపు శబ్దం తప్పితే యేమీ వినిపించలేదు. ప్రపంచం సర్వమూ వర్షపు ధ్వనులతో నిండిపోయినట్టుగా ఆకాశంలోంచి యేవో రాలిపడుతూ సవ్వడులు చేస్తూ వాటితో కలగలిసి మధ్యమధ్యలో అస్పష్టంగా రోడ్డువారగా వర్షపునీరు పారుతోన్న ధ్వని... యిందాక అద్భుతంగా అనిపించని ధ్వని మెల్లమెల్లగా తిరిగి కాస్తకాస్తగా అద్భుతంగా అనిపిస్తోంది.



*ఆంధ్రప్రభ ఆదివారం సంచిక*
*23 ఫిబ్రవరి 2003*